

వచ్చే నెల 11 నుంచి పుస్తక మహోత్సవం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మునిసిపల్ మైదానంలో నవంబరు 11 నుంచి 20వరకు పుస్తక సిక్కోలు పుస్తక మహోత్సవం నిర్వహిస్తామని కమిటీ ఛైర్మన్ డాక్టర్ కనుగుల సుధీర్ తెలిపారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 'నగరంలో తొలిసారిగా వందకుపైగా పుస్తక ప్రచురణ సంస్థలు ఈ మహోత్సవంలో పాల్గొనున్నాయి. ఆ పది రోజులూ కవి సమ్మేళనాలు, సాహిత్యగోష్ఠులు ఉంటాయి. తప్పెటగుళ్లు, కోలాటం, జముకులపాట, నాటికలు, సాంస్కృతిక, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తాం. విజేతలకు బహుమతులు అందజేస్తామ'ని తెలిపారు.

చేస్తున్నవి చెప్పరేం!

● అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా ఉత్తరాంధ్రకు చాలా చేస్తున్నాం. అయినా వాటిని చెప్పుకోవడంలో విఫలమవుతున్నాం. చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అధికారులతో మంచిగా పని చేయించుకోవాల్సిన బాధ్యత మంత్రులదే. మీ శాఖలో జరిగే మంచిని ప్రచారం చేసుకోకపోతే నష్టపోయేది మీరే.
- ఇదీ శుక్రవారం మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం


సరుబుజ్జిలి మండలం లక్ష్మీపురం సమీపంలో పవర్‌ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

● ఇటు ఎయిర్‌పోర్టు.. అటు థర్మల్ ప్రాజెక్టు..
● రెండు అంశాలు ప్రజలకు చేరువకాని వైనం
● అప్పుడప్పుడు సమావేశాలు.. ప్రకటనలతో సరి
● గ్రామాలకు వెళ్లి చైతన్యం తెస్తేనే ఫలితం
● నిస్తేజంగా ప్రజాప్రతినిధులు, అధికారులు

శ్రీకాకుళం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు భారీ ప్రాజెక్టులను ప్రతిపాదించింది. పలాస నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి, ఆమదాలవలస నియోజకవర్గంలో థర్మల్ విద్యుత్ కేంద్రం నెలకొల్పేందుకు చర్యలు చేపట్టింది. ఈ రెండు పూర్తయితే అభివృద్ధి పరంగా జిల్లా రూపురేఖలు మారిపోతాయి. వీటిపై ప్రచారం.. ప్రజల నమ్మకాన్ని చూరగొనడం అత్యంత ముఖ్యమైన విషయం. కానీ.. ఈ విషయంలో కూటమి నాయకులు, అధికారులు కాస్త వెనుకబడి ఉన్నారు. చేస్తున్న పనులు కూడా ప్రజలకు చెప్పుకోలేకపోతే ఎలాగన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● పోర్టు సమీపంలో ఎయిర్‌పోర్టు..

సంతబొమ్మాళి మండలం మూలపేట తీరంలో ఇప్పటికే పోర్టు దాదాపు పూర్తికావచ్చింది. అతిత్వరలో వినియోగంలోకి రానుంది. పోర్టుకు ఆనుకుని సువిశాల తీరప్రాంతం ఉండడంతో విదేశాల నుంచి సరుకుల రవాణాకు ఎంతో ఉపయోగపడనుంది. దీనికితోడుగా ఎయిర్‌పోర్టు నిర్మాణం కూడా చేపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పలాస నియోజకవర్గం మందస మండలంలో సుమారు 1300 ఎకరాల భూమి సేకరించి.. ఎయిర్‌పోర్టును నిర్మించాలని భావిస్తోంది. కొంత ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించి ముందుకెళ్లాలని ఆలోచిస్తోంది. ప్రభుత్వం అధికారిక ప్రకటనతోపాటు... ఎయిర్‌పోర్టు ఏర్పాటయ్యే ప్రాంతాల ప్రజలతో అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించారు. ప్రజలకు మూకుమ్మడిగా తెలియజేశారు. కానీ.. ప్రజలకు అర్థమయ్యేలా, ప్రతిఒక్కరిని చైతన్య పరిచే విషయంలో కాస్త వెనుకడుగులో ఉన్నారు.


మందస మండలం బిడిమి వద్ద ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత స్థలంలో ఒక భాగం

● పోర్టు ఏర్పాటైతే ఊహించని రీతిలో అభివృద్ధి..

పోర్టు.. ఆపై ఎయిర్‌పోర్టు నిర్మాణం వల్ల జిల్లా అభివృద్ధి ఊహించని రీతిలో జరగనుంది. ఈ విషయాన్ని ప్రజలకు చేర్చాల్సిన బాధ్యత అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలదే. కానీ ఈ విషయంలో వెనుకడుగులో ఉన్నారు. కొద్దిరోజుల కిందట భారీ సమావేశాన్ని నిర్వహించి కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆధ్వర్యంలో ఈ విషయాన్ని తెలియజేశారు. కానీ అంతటితో కార్యక్రమం ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ఎందుకంటే ఉద్యమకారుల పేరిట.. ప్రజలు వ్యతిరేకిస్తున్నారంటూ వెనుకనుంచి వైసీపీ నాయకులు చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఉద్యమాలకు పిలుపునిచ్చేలా సమావేశాలను ప్రజాసంఘాల పేరిట నిర్వహిస్తున్నారు. ఎయిర్‌పోర్టు కోసం భూములు సేకరిస్తే ప్రజలకు అన్యాయం జరిగిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించలేకపోతున్నారు కూటమి నాయకులు. ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో అధికార పార్టీకి కాస్త ఇబ్బందికరంగా మారింది. ఎడతెరిపి లేకుండా అక్కడ సమావేశాలు నిర్వహించి.. ప్రజలను చైతన్యపరిచి ఎయిర్‌పోర్టు వల్ల లాభాలను ప్రజలతోనే అనుకూలంగా చెప్పించేలా సదస్సులు నిర్వహించాలి. మండలాల నాయకులు, కార్యకర్తలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవడంలేదు. దీంతో ప్రజాసంఘాల నాయకులు వారంలో (మిగతా 6వ పేజీలో..)


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల రద్దీ

పది రోజుల్లో రూ.59 లక్షలు

● దసరా వేళ.. పెరిగిన ఆర్టీసీ ఆదాయం
● పైడితల్లమ్మ జాతర బస్సులతో గతేడాదికన్నా అదనంగా రూ.2లక్షలు

శ్రీకాకుళం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీకి అక్టోబరు నెల తొలి పదిరోజులు కలిసొచ్చింది. ఓవైపు దసరా.. మరోవైపు విజయనగరం పైడితల్లమ్మ జాతర కారణంగా ప్రత్యేక బస్సులు నడపడంతో అధిక ఆదాయం లభించింది. జిల్లాలో చాలామంది ఉపాధి కోసం దూరప్రాంతాలకు వలసపోయారు. పండగలకు, ప్రత్యేక సందర్భాలలో సొంతూళ్లకు వచ్చి వెళ్తుంటారు. వీరి కోసం ఏటా ప్రతి పండగలకు ఆర్టీసీ ప్రత్యేకంగా పలు రూట్లలో బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తోంది. ఈసారి దసరా సందర్భంగా శ్రీకాకుళం డిపోల నుంచే కాకుండా టెక్కలి, పలాస డిపోల నుంచి కూడా అమలాపురం, విజయవాడ, హైదరాబాద్ వరకు బస్సులను నడిపింది. విశాఖపట్నానికి మరిన్ని సర్వీసులను పెంచింది. మొత్తం 240 ఆర్టీసీ బస్సులను నడిపింది. దీని వల్ల 109 శాతం ఆక్యుపెన్సీ రేటు పెరిగింది. ఆదాయం రూ.59లక్షలు లభించింది. గతేడాది స్త్రీశక్తి పథకం అమలులో లేకపోవడం వల్ల దసరా కోసం 347 బస్సులను (మిగతా 6వ పేజీలో..)

అవే 'కీలు'కం

● కీళ్ల వ్యాధులతో జాగ్రత్త
● జిల్లాలో పెరుగుతున్న ఆర్థరైటిస్ బాధితులు
● ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మంచిది
● నేడు ప్రపంచ ఆర్థరైటిస్ దినం

6లో


7లో
పొందూరులో మద్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ, సిబ్బంది

మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు

● నిల్వలు, రికార్డుల పరిశీలన
● కల్తీ, నకిలీ మందు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిక

బాణసంచాతో జాగ్రత్త



● జిల్లాకు అనధికారికంగా 'దీపావళి' సామగ్రి
● జనావాసాల మధ్య భద్రపరుస్తున్న వైనం
● ఆందోళనలో ప్రజలు.. పట్టని అధికారులు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దీపావళి వేళ.. జిల్లాకు పెద్ద ఎత్తున బాణాసంచా నిల్వలు చేరుకున్నాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల నుంచి కొంతమంది అనధికారికంగా ముడిసరుకు తెప్పించుకుంటున్నారు. జనావాసాల మధ్య భద్రపరుస్తున్నారు. దీంతో సమీప నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 8న అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామవరంలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం జరిగి ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. జిల్లాలో కూడా గతంలో రెండు మూడుచోట్ల ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. దీపావళి పండుగ ఎంతటి ప్రమోదాన్ని కలిగిస్తుందో.. అప్రమత్తంగా లేకుంటే అంతటి ప్రమాదాన్ని (మిగతా 6వ పేజీలో..)

చర్యలు తప్పవు

అనధికారికంగా బాణాసంచా నిల్వ చేస్తే చర్యలు తప్పవు. అనుమతి ఉన్నవారు నిబంధనల మేరకు వ్యాపారాలు చేయాలి. అక్రమంగా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా క్రిమినల్ కేసులు తప్పవు. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు చేయడానికి బృందాలను ఏర్పాటు చేశాం. అక్రమ తయారీ, నిల్వ, విక్రయాలపై 112కు సమాచారం ఇవ్వాలి. అవసరమైతే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఈ నిబంధనలు తప్పనిసరి

● నివాసాలకు దగ్గరగా తాత్కాలిక, శాశ్వత బాణసంచా విక్రయ షాపుల ఏర్పాటుకు పోలీసులు అనుమతి ఇవ్వకూడదు.
● విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో, హైటెన్షన్ విద్యుత్ తీగలకు కింద దుకాణాలు పెట్టరాదు. ఊరి చివర ఏర్పాటు చేయాలి.
● దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం ఉండేలా చూడాలి. పొగ తాగరాదనే బోర్డులు ఏర్పాటు చేయాలి. నీటి సదుపాయం కల్పించాలి.
● డ్రై కెమికల్ పౌడర్ నాలుగైదు కిలోలు, సీఓటూ(కార్బన్ డై ఆక్సైడ్) ఐదుదు కిలోలు దుకాణం వద్ద ఉంచాలి.
● నిబంధనలకు మించి నిల్వలు ఉంచకూడదు. చిన్నపిల్లలను పనిలో పెట్టుకోకూడదు.
● అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచాలి.

పాశుపతాస్త్రం.. అమలులో లోపం

● సహచట్టంపై కనిపించని పర్యవేక్షణ
● దృష్టి పెట్టని అధికార యంత్రాంగం
● నేడు సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవం

6లో

పర్యవేక్షణ లేక.. పనులు సాగలే

● శివసాగర్‌బీచ్‌లో కానరాని మౌలిక సదుపాయాలు
● పర్యాటకులకు తప్పని అగచాట్లు

8లో

మట్టి కొట్టుకుపోయి.. రాళ్లు తేలి

● లొద్దభద్ర పంచాయతీలో అధ్వానంగా గిరిజన గ్రామాల రహదారులు

8లో

పెచ్చులూడి.. బీటలు వారి

● శిథిలావస్థకు చేరినా మరమ్మతులకు నోచుకోని కొత్తూరులోని ఆయుర్వేద ఆసుపత్రి


మాట్లాడుతున్న పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్

దమ్ముంటే కల్తీ మద్యంపై చర్చకు రావాలి

● పీయూసీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ సవాల్

అరసవల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ పాలనలో రాష్ట్రంలో కల్తీమద్యం విక్రయించి వేలాది మంది ప్రాణాలు తీశారు. కమీషన్ల పేరిట రూ.3,500 కోట్లు దోచుకున్నారు. మాజీ సీఎం జగన్‌కు దమ్ముంటే కల్తీ మద్యంపై బహిరంగ చర్చకు రావాల'ని పీయూసీ ఛైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సవాల్ విసిరారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం కల్తీ మద్యం అమ్ముతోందని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బురద జల్లే ప్రయత్నం చేస్తూ ప్రజల ముందు మరింత చులకన అవుతున్నారు. నేరగాళ్లను ప్రోత్సహించడం నీకు వెన్నతో పెట్టిన విద్య. నిజానికి నకిలీ మద్యానికి మూలాలు తాడేపల్లి ప్యాలెస్‌లోనే ఉన్న సంగతి అందరికీ తెలుసు. అందుకే నీవు కల్తీ మద్యంలో సహకరించిన ప్రతాప్‌రెడ్డి, గోవర్దనరెడ్డి వంటి వారికి గతంలో ఎమ్మెల్యే, మంత్రి పదవులిచ్చావు. కానీ మా అధినేత, సీఎం చంద్రబాబు కల్తీమద్యంపై ఉక్కుపాదం మోపారు. ఆరోపణలు వచ్చిన వెంటనే మా పార్టీలోని వ్యక్తులను కూడా వెంటనే సస్పెండ్ చేశారు. గతంలో కల్తీ మద్యంతో మరణించిన వారి కుటుంబాలను కనీసం ఏనాడైనా పరామర్శించావా?. కర్ణాటక, తమిళనాడుల్లో మీ కల్తీ మద్యాన్ని నిషేధించారు. అప్పుడైనా దానిపై వివరణ ఇచ్చావా?. నీవు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రాష్ట్రంలో సరఫరా అవుతున్న మద్యంలో ప్రమాదకర విష రసాయనాలు ఉన్నాయని అమెరికాలోని ఓ ల్యాబ్ కూడా ధ్రువీకరించింది. అటువంటి నీకు సీఎం చంద్రబాబుపై ఆరోపణలు చేసే హక్కు లేదు. ఇలా అబద్ధాలతో ప్రజలను ఎంతకాలం మోసం చేయగలవు. సర్పంచ్ కన్నా తక్కువ స్థాయిలో మాట్లాడుతున్నావ'ని దుయ్యబట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పీఎంజే బాబు, సింతు సుధాకర్, ప్రధాన విజయరాం పాల్గొన్నారు.

ఎవరు కోటీశ్వరులు

● అభివృద్ధిలో ప్రత్యేకత చాటితే రూ.కోటి
● గ్రామ పంచాయతీలకు కేంద్రం నజరానా
● తొమ్మిది అంశాలలో పరిశీలన

కోటబొమ్మాళి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు వీలుగా స్వచ్ఛత అవార్డుల పేరిట నజరానా ప్రకటించాయి. తొమ్మిది అంశాల్లో పురోగతి సాధించిన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి ఇవ్వనుంది. పంచాయతీల్లో ఏయే అంశాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో ఇప్పటికే ప్రకటించింది. ఈ భారీ ప్రోత్సాహకాన్ని పంచాయతీలు పొందేందుకు వీలుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. జిల్లాలో 912 పంచాయతీలున్నాయి. వీటిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖలు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశాయి. స్థానిక అవసరాలు, భౌగోళిక అంశాలకు తగ్గట్టుగా ప్రత్యేకతను చాటుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన తొమ్మిది అంశాలను పరిగణనలోనికి తీసుకుని పంచాయతీలకు పురస్కారాలు ప్రకటించనున్నారు. పంచాయతీలను ప్రగతిపథంలో నడిపించేందుకు జిల్లా పంచాయతీ అధికారి సైతం మండలాల్లో ఈఓపీఆర్‌డీలకు ఆదేశాలిస్తూ అమలుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వ మార్గనిర్దేశకాల మేరకు పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధిని డాక్యుమెంటరీ రూపంలో చిత్రీకరించి జిల్లా పంచాయతీ అధికారికి అందజేయాలి. వీటిని డీపీవో కార్యాలయం అధికారులు పరిశీలించి.. ఉత్తమమైనవి ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అధికారులు డిసెంబరులో పురోగతి సూచిక ప్రగతిని గుర్తించి.. ప్రోత్సాహకానికి ఎంపికైన పంచాయతీలను ప్రకటిస్తారు. ఆయా పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నజరానా అందజేస్తుంది.

తొమ్మిది అంశాలివే..

● గ్రామ పంచాయతీలో పేదరికం లేని జీవనోపాధిని పెంపొందించడం.
● ప్రజా ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరిచే కార్యక్రమాలు నిర్వహించడం.
● పిల్లల సంరక్షణ, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం సృష్టించడం.
● ప్రజలకు స్వచ్ఛమైన నీటిని పుష్కలంగా అందుబాటులోకి తేవడం.
● గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచడం.
● మౌలిక సదుపాయాల అభివృద్ధి.
● గ్రామంలో సామాజిక న్యాయాన్ని సురక్షిత వాతావరణంలో నెలకొల్పడం.
● శాంతియుతమైన, న్యాయమైన, బలమైన సంస్థలతో సుపరిపాలన.
● పంచాయతీ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలు.


లఖందిడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయం

పురోగతి సాధించేలా..

పంచాయతీలను అభివృద్ధి చేయడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొల్పేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నజరానా ప్రకటించాయి. అభివృద్ధి జరిగిన పంచాయతీలు డాక్యుమెంటరీ తీసి మా కార్యాలయానికి పంపించాలి. వాటిని పరిశీలించి, నిబంధనలకు అనుకూలంగా ఉన్న డాక్యుమెంటరీలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. తొమ్మిది అంశాలను ప్రాతిపదికగా పురోగతి సాధించిన పంచాయతీలను ఎంపిక చేసి ప్రోత్సాహకం అందజేస్తారు.

- భారతి సౌజన్య, జిల్లా పంచాయతీ అధికారి




అవే కీలుకం



- కీళ్ల వ్యాధులతో జాగ్రత్త ● జిల్లాలో పెరుగుతున్న ఆర్థరైటిస్ బాధితులు
- ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మంచిది ● నేడు ప్రపంచ ఆర్థరైటిస్ దినం

● శ్రీకాకుళం నగరానికి చెందిన అప్పలనాయుడు అనే నడి వయస్కుడు కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నాడు. ఎందరో వైద్యులను కలిశాడు. అయినా సరే వ్యాధి నయం కావడం లేదు. చివరకు చత్తీస్‌ఘడ్‌లో కీళ్ల నొప్పులకు మందులు ఇస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్లాడు. అయినా ప్రయోజనం కనిపించలేదు.

● ఎచ్చెర్ల ప్రాంతానికి చెందిన విశ్రాంత ఉద్యోగి శ్రీనివాసరావు కీళ్ల నొప్పులతో బాధ పడుతున్నాడు. కుటుంబ సభ్యుల సాయంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిని ఆశ్రయించాడు. అయినా నయం కాలేదు. దీనితో ప్రతిరోజూ తన వెంట వివిధ రకాల తైలాలు ఉంచుకుంటాడు. కానీ ఉపయోగం లేదని నిట్టూరుస్తున్నాడు.



శ్రీకాకుళం అర్బన్/అరసవల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి)

...ఈ ఇద్దరే కాదు.. ప్రతి ఊరిలోనూ కీళ్ల, వెన్ను నొప్పులతో బాధ పడేవారు నిత్యం మనకు కనిపిస్తుంటారు. ఈ వ్యాధులనే ఆర్థరైటిస్ అంటారు. ఇటీవల ఈ రుగ్మతతో బాధపడేవారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సమస్య పూర్వం ఎక్కువగా వృద్ధుల్లో కనిపించేది. కానీ ఇప్పుడు 40 ఏళ్లు దాటిన అనేక మందిలో కనిపిస్తోంది. మొదటిలోనే గుర్తించి జాగ్రత్తలు తీసుకుంటే సమస్యను చాలా వరకు తగ్గించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు.

లక్షణాలు..

భరించలేని నొప్పి, కీళ్లు గట్టిగా మారడం, ముఖ్యంగా ఉదయం వేళ వాపు, కదిలించే సామర్థ్యం లేకపోవడం, కీళ్ల చుట్టూ చర్మం ఎర్రగా మారి వేడిగా అనిపించడం వ్యాధి లక్షణం. ముఖ్యంగా భుజం, వెన్ను, తుంటి, చేతులు మణికట్టు, మోకాళ్లలో ఎక్కువగా లక్షణాలు కనిపిస్తాయి. ఈ సమస్య ఉంటే కీళ్లు, ఉమ్మడి మృదులాస్థికి, చుట్టుపక్కల భాగాల్లో కూడా ఇబ్బందిగా ఉంటుంది. ఈ రకమైన నొప్పులు కీళ్లను బలహీనంగా మారుస్తాయి. దీనితో నడవడం, మెట్లు ఎక్కడం, కంప్యూటర్ కీబోర్డు వాడడం, పళ్లు తోమడం వంటి పనులకు కూడా కష్టంగా ఉంటుంది. ఈ లక్షణాలను గుర్తిస్తే తక్షణమే వైద్యుని సంప్రదించి, సూచనలు, సలహాలు పాటించాలి. ప్రాథమిక దశలో గుర్తించి, వైద్యుని సలహా మేరకు చికిత్స తీసుకుంటే ఇది నయమవుతుంది.

ఎన్ని రకాలంటే...

ఆర్థరైటిస్‌లో వంద కంటే ఎక్కువ రకాలు ఉన్నాయి. సాధారణంగా ఇన్‌ఫ్లమేటరీ ఆర్థరైటిస్, ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, సొరియాటిక్ ఆర్థరైటిస్, ఫైబ్రోమైయాల్జియా, గౌట్ రకాలు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి.

ఆస్టియో ఆర్థరైటిస్...

ఈ సమస్యలో మృదులాస్థి, ద్రవం రోజులు గడిచేకొద్దీ విచ్ఛిన్నమవుతాయి. దీనితో కీళ్ల కదలిక కష్టతరమవుతుంది. బాధాకరంగా ఉంటుంది. చివరకు ఉమ్మడి ఎముకలు నేరుగా రుద్దుకొని తీవ్ర నొప్పి ఏర్పడుతుంది. ఈ సమస్యలో వాపు కూడా ఉంటుంది. ఇది సాధారణంగా మోకాలు, చేతులు, వెన్నెముకపై ప్రభావం ఉంటుంది.

రుమటాయిడ్ ఆర్థరైటిస్...

రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. దీనితో కీళ్లు, ఇతర అవయవ కణజాలాలపై ప్రభావం పడుతుంది. వైరస్‌లు, బ్యాక్టీరియా పెరిగి వాపునకు కారణమవుతాయి ఈ సమస్యతో బాధ పడేవారికి ఇన్‌ఫ్లమేషన్ పెరుగుతుంది. ఈ సమస్య కారణంగా రెండు మోకాళ్లు, చేతులు రెండు వైపులా సమాంతర కీళ్లు ప్రభావితమవుతాయి. ఇది కాలేయం, గుండె, కళ్లతో సహా అంతర్గత అవయవాలను కూడా ప్రభావితం చేస్తుంది.

ఎందుకు వస్తుందంటే...

అధిక బరువు కలిగి ఉండడం, స్త్రీలలో 50 ఏళ్లు దాటాక, పురుషుల్లో 55 ఏళ్లు దాటాక, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, మద్యం తాగడం, ధూమపానం వంటి కారణాల వల్ల ఎముకలు గుల్లబారి, కీళ్ల మధ్య దూరం తగ్గి, ఎముకల సాంద్రత తగ్గడం వల్ల ఆర్థరైటిస్ వస్తుంది.

నివారణ ఎలాగంటే...

బరువు తగ్గడం, సరైన ఆహార నియమాలు, శారీరక వ్యాయామం చేయాలి. కాల్షియం అధికంగా గల పాలు, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు ఆహారంలో తప్పకుండా తీసుకోవాలి. క్రమం తప్పకుండా తేలికైన వ్యాయామాలు చేయాలి. ఆర్థరైటిఎస్ లక్షణాలు కనబడితే వెంటనే వైద్యుని సంప్రదించాలి. మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలి. ఆరోగ్యకరకమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి.

పెరుగుతున్న కేసులు..

శ్రీకాకుళంలోని రిమ్స్‌లో ఎముకల విభాగానికి సంబంధించి ఏటా వేలల్లో కేసులు నమోదవుతున్నాయి. 2023వ సంవత్సరంలో 45,266 కేసులు నమోదు కాగా, 2024లో 38,996, 2025లో ఇప్పటి వరకు 32,087 కేసులు నమోదైనట్టు గణంకాలు చెబుతున్నాయి. వీటిలో ఆర్థరైటిస్ కేసులు 2023లో 7,570 నమోదవగా... 2025 సెప్టెంబరు నాటికి 8,523 కేసులు నమోదు కావడం గమనార్హం. ఆసుపత్రికి ప్రతి నెలా సగటున 3,854 మంది ఎముకల విభాగానికి చికిత్సల కోసం వస్తున్నారు.

రిమ్స్‌లో అధునాతన చికిత్స..

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆర్థరైటిస్‌కు సంబంధించి అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందుతున్న పీఆర్‌పీ (ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా) చికిత్స ద్వారా కీళ్ల జాయింట్ల వద్ద ఇంజక్షన్ వేయడం ద్వారా తక్షణ ఉపశమనం పొందేలా ఉచితంగా సేవలు అందిస్తున్నాం. అలాగే కీళ్ల మార్పిడి, కీహోల్ శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. జిల్లాలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **-డా.ఎల్.ప్రసన్నకుమార్, రిమ్స్ ఆర్థోవిభాగం హెచ్‌ఓడీ**

తక్షణమే అప్రమత్తం కావాలి..

కీళ్లనొప్పులు ఉంటే ముందుగా మీ శరీర బరువు, బీఎంఐ చెక్ చేయాలి. మీరు అధిక బరువు ఉంటే... కీళ్లపై ఒత్తిడి తగ్గించాలంటే బరువు తగ్గాలి. నడక, వ్యాయామం దిన చర్యలో భాగంగా కావాలి తొడ కండరాలకు సంబంధించిన వ్యాయామం నిత్యం చేయాలి. కీళ్లనొప్పులను తగ్గించేందుకు వైద్యులను కలవాలి. సమస్య ఉన్నవారికి జాయింట్స్‌పై లేపనాలు, జెల్స్ వాడవచ్చు. దీని వల్ల సమ స్య తగ్గుతుంది. మందులు సూచిస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని నిర్లక్ష్యం చేయకూడదు. అలా చేస్తే మూల్యం తప్పదు.

-డాక్టర్ సుధీర్‌తులసి, ఆర్థోపెడిక్ నిపుణుడు, శ్రీకాకుళం

చేస్తున్నవి చెప్పరేం!

(ఐదో పేజీ తరువాయి)

రెండు మూడు సమావేశాలు నిర్వహిస్తూ ఉద్యమాన్ని చాపకింద నీరులా స్పీడు పెంచారు. ఇప్పటికైనా కూటమి నేతలు పరిస్థితి చేయిదాటకుండా.. పోర్టుల వల్ల జిల్లాకు కలిగే ప్రయోజనాలు, అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సి అవసరం ఉంది.

● రూ. 30వేల కోట్లతో థర్మల్ విద్యుత్ కేంద్రం..

ఆమదాలవలస నియోజకవర్గం సరుబుజ్జిలి మండలంలో రూ. 30వేల కోట్ల వ్యయంతో 3,200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా థర్మల్ ప్లాంట్ నిర్మాణానికి ఏపీ జెన్‌కో ప్రతిపాదన సిద్ధం చేసింది. ప్రస్తుతం సాంకేతిక అభివృద్ధిలో పరిస్థితుల దృష్ట్యా భద్రత పరంగా మరిన్ని చర్యలు తీసుకోనుంది ప్రభుత్వం. కానీ ఈ విషయంలో ప్రజాసంఘాలు.. ఉద్యమ నాయకులు.. అప్పుడే థర్మల్ విద్యుత్ కేంద్రం వద్దంటూ గ్రామాల్లో సభలు పెట్టేస్తున్నారు. ప్రజల్లో వ్యతిరేకత నింపుతున్నారు. కాగా.. థర్మల్ ప్రాజెక్టు ఏర్పాటైతే కలిగే ప్రయోజనాలను వివరించడంలో అధికార పార్టీ నాయకులు.. ప్రభుత్వ పెద్దలూ వెనుకడుగులో ఉన్నారు. 'థర్మల్'పై ప్రజల్లో భయాందోళనకు చెక్‌పెట్టేలా.. సందేహాల నివృత్తి చేసేలా సరైన కార్యక్రమాలు.. నిర్వహించలేకపోయారు. ఈ ప్రాంతంలో... విద్యుత్ కేంద్రం కార్యరూపం దాల్చాలనుకుంటే అధికారికంగా సమావేశాలు నిర్వహించి.. ప్రజలను ఒప్పించి.. వారికి భద్రతాపరంగా అన్ని అంశాలను తెలియజేసి.. ఉద్యమకారులు వారి వద్దకు వెళ్లకుండా చేయగలిగేలా పోటీగా సభలు.. సదస్సులు నిర్వహించాల్సి ఉంది. కానీ అలా చేయడంలేదు. దీనివల్ల అలాఅలా పరిస్థితి మారితే ఉద్యమం తీవ్రతరమైతే పోలీసుల సమక్షంలో సమావేశాలు నిర్వహించవచ్చు. కానీ అది నెగిటివ్‌గా ప్రజల్లోకి వెళ్లి.. ప్రభుత్వంపైనా ఓరకంగా ఇబ్బంది తెచ్చిపెడుతుంది. ఇటువంటి సున్నితమైన అంశాలపై మరింత జాగ్రత్తగా జిల్లా ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉంది. ముప్పు లేకుండా జిల్లా అభివృద్ధి విషయంలో ప్రజలను భాగస్వామ్యం చేసేలా కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

పది రోజుల్లో రూ.59 లక్షలు

(ఐదో పేజీ తరువాయి)

నడిపారు. అయినప్పటికీ ఆక్యుపెన్సీ రేటు కేవలం 76శాతమే. ఆదాయం రూ.65లక్షలు మాత్రమే. ఈ ఏడాది బస్సుల సంఖ్య 107 తగ్గించినా.. దాదాపుగా ఆదాయం సమకూరడం గమనార్హం. స్త్రీశక్తి పథకం ద్వారా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లో రద్దీవల్ల అల్ట్రా డీలక్స్ వంటి బస్సులకు ప్రయాణికుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది.

● పైడితల్లమ్మ జాతర వల్ల..

విజయనగరంలో పైడితల్లమ్మ జాతర అంటే ఉత్తరాంధ్ర నుంచి అధికమంది వెళ్లి దర్శించుకుంటారు. శ్రీకాకుళం నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా 16 బస్సులను ఏర్పాటు చేసి.. మొత్తం 94 ట్రిప్పులు వేసింది. దీని ద్వారా రూ.3.76 లక్షల ఆదాయం లభించింది. బస్సుల ఆక్యుపెన్సీ రేటు 100 శాతం. అంటే బస్సు లన్నీ కిటకిటలాడాయి. గతేడాది పైడితల్లమ్మ జాతర స్పెషల్‌గా 15 బస్సులను ఏర్పాటు చేసి 66 ట్రిప్పులు వేశారు. దీనివల్ల కేవలం రూ.1.75 లక్షలు మాత్రమే ఆదాయం లభించింది. ఆక్యుపెన్సీ రేటు పరిశీలిస్తే.. 64 శాతమే. ఈసారి జాతరకు వెళ్లిన వారి సంఖ్య రెట్టింపైంది.. గతేడాదికంటే అదనంగా 2 లక్షలు లభించింది.

బస్సు సర్వీసులు పెంచుతున్నాం..

ఇప్పుడు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరిగింది. స్త్రీశక్తి కోసం బస్సులు సెపరేటుగా నడుస్తున్నాయి. ఆ బస్సులలో రద్దీ వల్ల ఇతర బస్సుల్లో టిక్కెట్‌లు తీసుకుని ప్రయాణించే మహిళలూ ఉన్నారు. ప్రయాణికుల కోసం బస్సు సర్వీసులు పెంచుతున్నాం. దీనివల్ల ఆర్టీసీకి ఆదాయం లభిస్తుంది.

-అప్పలనారాయణ, ఆర్టీసీ సీటీఎం, శ్రీకాకుళం

బాణసంచాతో జాగ్రత్త!

(ఐదో పేజీ తరువాయి)

కూడా తెచ్చిపెడుతుంది. ఈ నేపథ్యంలో బాణసంచా విక్రయదారులతోపాటు వాటిని కొనుగోలు చేసే ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

● జిల్లాలో శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో మాత్రమే అధికారికంగా అనుమతులు కలిగిన షాపులు ఉన్నాయి. కానీ ప్రతి పట్టణానికి, మండలానికి అనధికారికంగా బాణసంచా సామగ్రి చేరింది. జిల్లాలో 12 మంది ఏడాది పొడవునా బాణసంచా తయారు చేసే లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. వీరు ఆర్డర్‌పై మాత్రమే తయారు చేసి విక్రయించాలి. దుకాణాలకు అమ్మకూడదు. ఈ కేంద్రాలు జనావాసాలకు కచ్చితంగా దూరంగా ఉండాలి. బాణసంచా తయారీ విక్రయ కేం ద్రాలను పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కానీ జిల్లాలో ఆ పరిస్థితి లేదు. దీపావళి సమీపిస్తున్నా కనీసం ప్రజలకు అవగాహన కల్పించడంపై కూడా దృష్టిసారించడం లేదు. ఫ్యాక్టరీస్ డిపార్ట్‌మెంట్ సేఫ్టీ నిబంధనలు కఠినంగా ఉంటాయి. కానీ బాణసంచా సామగ్రి తయారీ కేం ద్రాలు తమ పరిధిలోకి రావాలంటూ ఆ శాఖాధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం దీపావళి టపాసులు తయారు చేసి విక్రయించడానికి వీల్లేదు. వేరే రాష్ట్రాల నుంచి హోల్‌సేల్‌గా తెచ్చుకున్న వారి దగ్గర నుంచి రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసి విక్రయించాలి. ఏడాది పొడువునా బాణసంచా తయారు చేయడానికి లైసెన్స్ తీసుకున్నవారు 15కిలోలకు మించి తమ వద్ద ముడిసరుకుల నిల్వ ఉంచకూడదు. కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ నిబంధనలు సక్రమంగా అమలుకావడం లేదు. ఊహించని ఘటన జరిగితే.. అధికారులు హడావుడి చేస్తూ నివేదికలతో చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పాశుపతాస్త్రం.. అమలులో లోపం

- సహచట్టంపై కనిపించని పర్యవేక్షణ ● దృష్టి పెట్టని అధికార యంత్రాంగం ● నేడు సమాచార హక్కు చట్టం అమలు దినోత్సవం



శ్రీకాకుళం మున్సిపల్ ఆఫీసులో మూలన పడి ఉన్న సహ చట్టం బోర్డు



పౌర సరఫరాల కార్యాలయంలో అసంపూర్తిగా సహ చట్టం బోర్డు

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పాలనలో జవాబుదారీతనం... పారదర్శకతను పెంపొందించడం.. అవినీతిని అరికట్టడమే ధ్యే యంగా రూపుదిద్దుకున్నదే సమాచార హక్కు చట్టం. 2005 అక్టోబరు 12న ఈ చట్టం అమలులోకి వచ్చింది. దీని ద్వారా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమాచారాన్ని సేకరించవచ్చు. ముఖ్యంగా అవినీతి, అక్రమాలకు సంబంధించిన అనేక రకాల సమాచారం వెల్లడి కావడానికి సమాచార హక్కు చట్టం ఎంతగానో ఉపయోగపడుతోందనడంలో సందేహం లేదు. గత ఇరవయ్యేళ్లలో ఇలా బయటపడిన సంఘటన లూ ఎన్నో ఉన్నాయి. స.హ. చట్టాన్ని పౌరుల చేతిలోని పాశుపతాస్త్రంగా అభివర్ణిస్తారు. దీన్ని బట్టి ఈ చట్టం విశిష్టతను తెలుసుకోవచ్చు. కానీ దీని అమలులో అనేక లోపాలు ఉన్నాయి. అధికశాతం ప్రజలకు ఇప్పటికీ దీని వినియోగంపై అవగాహన లేకపోవడమే దీనికి నిదర్శనం.

దరఖాస్తు ఇలా...

ఈ చట్టం ప్రకారం దేశపౌరులు ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఏ సమాచారాన్నైనా అడగవచ్చు. మనకు కావలసిన సమాచారం కోసం సంబంధిత కార్యాలయాల్లో ఉండే పౌర సమాచార అధికారికి దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు నిర్దిష్టమైన నమూనా అవసరం లేదు. గ్రామ స్థాయి సమాచారానికైతే ఏవిధమైన రుసుం చెల్లించనక్కరలేదు. మండల స్థాయి సమాచారానికైతే రూ.5, జిల్లా, ఆపై స్థాయికైతే కేవలం రూ.10 చెల్లిస్తే సరిపోతుంది. ఈ మొత్తాన్ని నగదు, డిమాండ్ డ్రాఫ్ట్, పోస్టల్ ఆర్డర్, కోర్టు ఫీజు స్టాంపుల రూపంలో చెల్లించవచ్చు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారు ఏ స్థాయి సమాచారానికైనా రుసుం చెల్లించనవసరం లేదు. తెల్ల రేషన్ కార్డు జిరాక్సు కాపీని దరఖాస్తులకు జత చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుడు ఏ కారణంతో సమాచారం అడుగుతున్నదీ తెలుపనవసరం లేదు. దేశ రక్షణకు సంబంధించిన సమాచారం తప్ప ఏ అంశానికి సంబంధించినదైనా కోరవచ్చు.

పరిష్కారం ఇలా..

ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ పౌర సమచార అధికారులు ఉంటారు. తమకు దరఖాస్తు అందిన 30 రోజుల్లోగా పౌర సమాచార అధికారులు దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని అందజేయాల్సి ఉంటుంది. ఈ గడువులోగా సమాచారం అందకపోయినా.... అందిన సమాచారం సంతృప్తిగా లేకపోయినా... మరో 30 రోజుల్లోగా దరఖాస్తుదారుడు అదే కార్యాలయంలో ఉన్న వద్ద మొదటి అప్పిలేట్ అధికారి వద్ద అప్పీల్ చేసుకోవాలి. అక్కడ కూడా అదే పరిస్థితి ఎదురైతే దరఖాస్తుదారుడు రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌కు అప్పీల్ చేసుకోవాల్సి ఉంటుంది. సమాచారం అందించడంలో పౌర సమాచార అధికారి లోపం ఉందని కమిషన్ భావిస్తే రోజుకు రూ.250 నుంచి గరిష్ఠంగా రూ.25000 వరకు పౌర సమాచార అధికారికి జరిమానా విధించే అవకాశం ఈ చట్టం కల్పించింది. ఆ పౌర సమాచార అధికారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవ లసిందిగా ప్రభుత్వానికి సమాచార కమిషనర్ సిఫారసు చెయ్యవచ్చు.

రికార్డుల నిర్వహణ ఏదీ?

ప్రతి ప్రభుత్వ కార్యాలయం ఈ చట్టంలో పేర్కొన్న సెక్షన్ 4(1)బి రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ రికార్డుల్లో కార్యాలయానికి సంబంధించిన సమాచారాన్ని పొందుపరచి పౌరులకు అందుబాటులో ఉంచాలి. ఈ రికార్డులో ఉన్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ చట్ట ప్రకారం పౌర సమాచార అధికారి, మొదటి అప్పీల్ అధికారుల చిరునామా, ఫోన్ నంబర్లు విధిగా ఒక బోర్డుపై రాసి.. ప్రదర్శించాల్సి ఉంటుంది. ప్రతి ప్రభుత్వ కార్యాలయం తమకు అందే దరఖాస్తుల వివరాలు, వాటి పరిష్కార తేదీల వివరాలు రికార్డులో నమోదు చేసి దీని ప్రతిని మూడు నెలలకోసారి కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది. ఇటువంటి నివేదికలు జిల్లా కేంద్రానికి అనేక మంది అధికారులు సరిగా పంపించడం లేదని సహచట్టం కార్యకర్తలు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో అంతంతమాత్రమే..

సమాచార హక్కు చట్టం పటిష్టంగా ఉన్నప్పటికీ జిల్లాలో దీని అమలు తీరు అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ చట్టం అమలులోకి వచ్చి ఇరవై ఏళ్లు గడుస్తున్నా... అనేక కార్యాలయాల్లో 4(1)బి రికార్డు నిర్వహణ సరిగా ఉండడం లేదు. సహ చట్టం తెలిపిన సెక్షన్ 5(1),(2) ప్రకారం పౌర సమాచార అధికారి వివరాలు తెలిపే బోర్డులు కూడా అనేక కార్యాలయాల్లో కనిపించవు. ఉన్నా.. అవి పాత పేర్లతోనే దర్శనమిస్తుంటాయి. సహ చట్టం అమలు తీరును పర్యవేక్షించాల్సిన కలెక్టర్ కార్యాలయంలో కూడా ఈ బోర్డులు సరిగా లేవంటే ఈ చట్టం అమలు తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సరిగా అమలు కావడం లేదు..

జిల్లాలో సహ చట్టం సరిగా అమలు కావడం లేదు. అనేక కార్యాలయాల్లో 4(1)బి రికార్డులు లేవు. ఈ రికార్డు పేరు చెప్పగానే కొంతమంది పౌర సమాచార అధికారులు తెల్లమొహం వేస్తున్నారు. జిల్లాలో సమన్వయ అధికారిగా కలెక్టర్ సంవత్సరానికి ఒక్కసారైనా సహ చట్టం కార్యకర్తలతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తే బాగుంటుంది. అవగాహనా లోపంతో ప్రజల్లోనూ కొంతమంది ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. కొన్ని కార్యాలయాల్లో పౌర సమాచార అధికారుల వివరాలు తెలిపే బోర్డులు కూడా లేవు. చట్టం అమలు తీరుపై పర్యవేక్షణ లేకపోవడమే దీనికి కారణం.

-ఉంగటి వెంకటరమణ, సహ చట్టం కార్యకర్త

అమలుకు ప్రయత్నిస్తున్నాం..

సహ చట్టం సక్రమంగా అమలు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. రోజువారీ పని ఒత్తిడి వల్ల అధికారులు కొన్నిచోట్ల సరిగా రికార్డులు నిర్వహించని మాట వాస్తవమే. అటువంటివి మా దృష్టికి వస్తే చర్యలు తప్పవు. త్రైమాసిక నివేదికలు కూడా ఇప్పుడు రావడం లేదన్నది నిజమే. వాటిని తెప్పించుకొని... సహ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు కృషి చేస్తాం.

-వెంకటేశ్వరరావు, డీఆర్వో, సహ చట్టం జిల్లా నోడల్ అధికారి



సింగుపురం వద్ద గండ్లు పూడ్చుతున్న దృశ్యం

కాలువలు కాటు వేయకుండా..

నందిగాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అనేక చోట్ల చెరువులు, కాలువలకు గండ్లు పడ్డాయి. నీటి ముంపులో ఉండిపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. పంటలు నష్టపోయారు. ఇలాగే ఉంటే భవిష్యత్తులో పంట దక్కే పరిస్థితి ఉండదేమోనని బెంబేలెత్తారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించారు. గండ్లు పూడ్చివేతకు కదిలారు. ఈ క్రమంలో మండలంలోని సింగుపురం సమీపంలో గల వంశధార 55, 56 కాలువలకు పడిన గండ్లు పూడ్చించేందుకు ఉపక్రమించారు. శనివారం ఈ పనులను చేపట్టారు. టెక్కలి వంశధార ఏఈ శేఖరరావు, నీటి సంఘం అధ్యక్షులు జయరాం ఆధ్వర్యంలో యంత్రాలతో గండ్లు పూడ్చివేత పనులు చేపట్టారు.

పలాసలో అరుదైన పాము

పలాస, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐదోవార్డు తాళభద్ర రోడ్డులో రైతులకు అరుదైన హేమర్‌హ్యాండ్ స్లగ్ పాము కనిపించింది. వానపాము జాతికి చెందిన ఈ పాము తల సుత్తిలా ఉంటుంది. వెనుక భాగమంతా నలుపు, పసుపు గోధుమరంగు ఆకారం కలిగి... రెండు అడుగుల వరకూ పెరుగుతుంది. వానపాములను తింటుంది. ఇది ఆసియాకు చెందిన జీవి. యూఎస్, తూర్పు యూఎస్, పసిఫిక్ తీరంలో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. ఈ పాము ప్రమాదకరమైనది కాదని ఈస్ట్రన్‌ఘాట్స్ వైల్డ్‌లైఫ్ సొసైటీ వ్యవస్థాపకుడు కంటిమహంతి మూర్తి, సభ్యుడు ఓంకార్‌త్యాడి తెలిపారు. దీన్ని పట్టుకుంటే దురదలు పుడతాయని, చేతికి గ్లౌజ్ వేసుకొని దీన్ని పట్టుకోవచ్చని ఆయన తెలిపారు. దీని శరీరాన్ని కత్తిరిస్తే కొన్ని భాగాల నుంచి పునరుత్పత్తి చేస్తుందని, ఇటువంటి జీవులు కనిపిస్తే హాని చేయవద్దని కోరారు.



రైతులకు కనిపించిన పాము



కోటబొమ్మాళిలో ఇలా..

వద్దన్నా వినరే!

- వాహనాలపై ప్రమాదకర ప్రయాణం

కోటబొమ్మాళి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమని తెలిసినా అనేక మంది నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్నారు. ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డు, కొత్తపేట జంక్షన్, పాతబస్టాండ్ కూడళ్లలో, పాఠశాలలు, కళాశాల ఉండే ప్రదేశాల్లో నిత్యం అనేక మంది ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తూ కనిపిస్తున్నారు. నిత్యం ఎక్కడో ఓ చోట రహదారి ప్రమాదాల్లో ఎవరో ఒకరు మృత్యువాత పడుతుండడం... మరికొందరు దివ్యాంగులుగా మారుతుండడం వంటివి చూస్తున్నా మార్పు రావడం లేదు. బాలురు, యువకులే కాదు... పెద్దలు సైతం ఇలాగే ప్రయాణిస్తుండడం గమనార్హం. ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న వారి కారణంగా ఎంతో మంది అమాయకులు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండడం.. వైకల్యానికి గురవుతుండడం గమనార్హం.

మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు

పొందూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పొందూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని పొందూరు, జి.సిగడాం మండలాల్లో ఉన్న 10 మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ వై.రాజు, ఎస్ఐ కరుణప్రసాద్ శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదే శాలతో సిబ్బందితో కలిసి దాడు లు చేసి మద్యం నిల్వలు, రికార్డు లను పరిశీలించారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో భారీగా నకిలీ మద్యం పట్టుబడడంతో సీఎం ఆదే శాలతో ఎక్సైజ్ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. నాణ్యమైన మద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్య మని, మద్యం కల్తీచేసినా, నకిలీ మద్యం విక్రయించినా దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.

● పాతపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం నియంత్రణకు తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎక్సైజ్‌శాఖ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. తెంబూరు మద్యంషాపులో శనివారం తనిఖీ నిర్వహించారు.

● నరసన్నపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నూతన మద్యవిధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన మద్యం అందించేందుకు ఎక్సైజ్‌శాఖ పనిచేస్తోందని సీఐ పి.లీలారాణి తెలిపారు. శనివారం పట్టణంలోని పలు మద్యం షాపుల్లో మద్యం నిల్వలు పరిశీలించి నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో ఎస్ఐ గురుమూర్తి పాల్గొన్నారు.

● పలాసరూరల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మద్యంషాపులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పలాస ప్రొహిబిషన్ అండ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం టెక్కలిపట్నం, బ్రాహ్మణతర్లా, పలాస మునిసిపాలిటీలో పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు 143 నమూనాలను సేకరించామన్నారు.

● ఇచ్ఛాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యాన్ని విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. గత నెల రోజుల్లో అన్ని షాపుల్లో తనిఖీలు చేపట్టి 121 మద్యం నమూనాల విశాఖలోని ఎక్సైజ్ లేబరేటరీకి పంపించామన్నారు.

● టెక్కలి,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల్లోని మద్యం దుకాణాల్లో తనిఖీ చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ మీరా సాహెబ్ తెలిపారు. గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 111 నమూనాలను నాణ్యత పరిశీలనకు ల్యాబ్‌కు పంపించామని తెలిపారు.

● కొత్తూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి) మద్యం నాణ్యతపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు సేకరించనున్నామని, ఎవరికైనా ఎటువంటి అనుమానాలు వచ్చిన ఫిర్యాదు చేయాలని కొత్తూరు ఎక్సైజ్ సీఐ బి.కిరణ్మయేశ్వరి తెలిపారు. మద్యం షాపులను పరిశీలిస్తున్నామన్నారు.

● సరుబుజ్జిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఆమదాలవలస ఎక్సైజ్ ఎస్ఐ సీహెచ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని సరుబుజ్జిలి, సవలాపురం, రొట్టవలసల్లోని మద్యం దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. మద్యం నమూనాలను రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలోని ఎక్సైజ్ లేబరేటరీకి పంపించడం జరుగుతుందన్నారు.

ఆటవిడుపు



గురిచూస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

అరసవల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక 80 అడుగుల రోడ్డులోని టీడీపీ జిల్లా కార్యాలయ ఆవరణలో ప్రతీ రోజు ఆర్చరీ క్రీడాకారులు శిక్షణ పొందుతుంటారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం కార్యాలయానికి వచ్చి క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు సందడి చేశారు. విల్లును ఎక్కుపెట్టి టార్గెట్ కొట్టేందుకు ప్రయత్నించారు. ఆర్చరీ క్రీడాకారులను, కోచ్‌తో ముచ్చటించారు. అనంతరం కార్యాలయ ఆవరణలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూర్చుని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు.

వెంకన్నస్వామికి ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బొడ్డకాళి గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక మాసం మొదటి శనివారం సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునుంచే పవిత్ర స్నానాలు ఆచరించి ఆలయానికి వచ్చి ప్రత్యేక అభిషేకాలు, దీపా రాధన చేపట్టారు. ఆంధ్రాతో పాటు ఒడిశా గ్రామాల నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఆసుపత్రిలో బెంచీల ఏర్పాటు



బెంచీలను ప్రారంభిస్తున్న వైద్యాధికారి రాంజీ

కవిటి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. డయాలసిస్‌కు వచ్చే రోగులు, వారి సహాయకులు వేచి ఉండేందుకు గాను కవిటిసొండికుల సంక్షే మ సంఘం వీటిని వితరణగా అందించగా శనివారం వైద్యాధికారి రాంజీ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.రామారావు, ఎం.నాగేశ్వరరావు, ఎంపీ శేఖర్, ఎం.సీతారాం, ఎస్.సదానందం, బి.ధనుంజయం పాల్గొన్నారు.

రోడ్డుపై ఇసుకతో ఇబ్బందులు



రోడ్డుపై ఉన్న ఇసుక

రణస్థలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి రామ తీర్థం వెళ్లే ఆర్ అండ్‌బీ రహదారిపై ఇసుక మేట వేయడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జడ్పీ హైస్కూల్‌కు వేళ్లే జంక్షన్ వద్ద రామతీర్థం రోడ్డుపై నుంచి నీరు పారడంతో ఇసుక వచ్చి చేరింది. దీంతో ఈ మార్గంలో వెళ్లే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలపై వెళ్లే కార్మికులు బైక్ స్కిడ్ అయ్యి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీల్‌చైర్ అందజేత

సోంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బారువ ప్రభుత్వ ఆసుపత్రికి టీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్ సీపాన గుణవతి వీల్‌చైర్‌ను శనివారం అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు పి.దుర్యోధన, గేదల హేమంత్, నరసింహులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత దళితులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న దళిత నేతలు ఎర్రయ్య, శ్రీనివాసరావు

సరుబుజ్జిలి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మూలసవలాపురానికి చెందిన శబరి కులస్థులపై జరుగుతున్న దాడులపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా దళిత హక్కుల పోరాట కమిటీ నాయకులు గొల్లపల్లి ఎర్రయ్య, సిరిపల్లి శ్రీనివాసరావు కోరారు. ఇటీవల శ్రీకాకుళం పట్టణంలో జరిగిన ఓ సంఘటనకు వ్యతిరేకంగా శనివారం సవలాపురం జంక్షన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూలసవలాపురంలో సుమారు 60 రెల్లి కుటుంబాలు రోజు కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఉపాధి నిమిత్తం శ్రీకాకుళం పట్టణానికి వెళ్లిన రెల్లి కులస్థులపై తప్పుడు కేసులు బనాయించి వేధించడం బాధాకరమన్నారు. ఇటీవల బ్యాంకర్స్ కాలనీలో జరిగిన ఓ ఘటనలో దళిత మహిళ అని కూడా చూడకుండా విచక్షణారహితంగా కొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శబరి కులస్థులపై పెట్టిన అక్రమ కేసులపై విచారణ చేపట్టి బాధ్యులపై అట్రాసిటీ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. కార్యక్రమంలో మూల సవలాపురానికి చెందిన బాధిత మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోపురంపై పిచ్చిమొక్కలు



గార, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మనాథుని దక్షిణ గోపురంపై పిచ్చి మొక్కలు మొలిచాయి. దీంతో గోపురం పాడయ్యే పరిస్థితి ఉంది. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఆలయ గోపురంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

ప్రతీ ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి



ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

గార/రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరిలో భక్తిభావం పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కుమ్మరిపేట గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉమా సహిత నీలకంఠే శ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం ఆయనకు అర్చకులు వేదాశీర్వాదం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొండు భాస్కరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పీస వెంకటరమణమూర్తి, మాజీ సర్పంచ్‌లు బడగల వెంకటప్పారావు, గొండు వెంకట రమణమూర్తి, కొంక్యాన ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ అమలు చేయాలి



డైరెక్టర్ బాలాజీకి వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఎచ్చెర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ పాటించాలని జిల్లా దళిత సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు శనివారం క్యాంపస్ డైరెక్టర్ డా.కేవీజీడీ బాలాజీని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 2016లో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేశారని, నాటి నుంచి ఇప్పటి వరకు రిజర్వేషన్ పాటించలేదన్నారు. సిబ్బంది నియామకాల్లో రాజకీయ సిఫార్సులకు ప్రాధాన్యత కల్పిం చడం వల్ల ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగిందన్నారు. భవిష్యత్‌లో న్యాయం జరగక పోతే దళిత ఆదివాసీ మైనార్టీలు, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో దళిత సంఘ నేతలు దుర్గాసి గణేష్, మిస్క కృష్ణయ్య, టొంపల రమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ఇచ్ఛాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని జై భీమ్ సేన జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సల్ల దేవరాజు అన్నారు. శనివారం ముత్యాలమ్మపేటలో ఇంటింటికి వెళ్లి అంబేడ్కర్ చిత్రపటాలు, రాజ్యాంగం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.ఈశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకట్రావు, దళిత నాయకులు బి.ఆనంద్, వాసుదేవరావు, శేఖర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చులూడి.. బీటలు వారి

● శిథిలావస్థకు చేరినా మరమ్మతులకు నోచుకోని వైనం
● ఇదీ కొత్తూరులోని ఆయుర్వేద ఆసుపత్రి పరిస్థితి

కొత్తూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కొత్తూరు సీహెచ్‌సీ ఆవరణలో గల ఆయుర్వేద ఆసుపత్రిశిథిలావస్థకు చేరడంతో ఇక్కడకు వచ్చేరోగులు భయాందోళన చెందుతున్నారు. రెండు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనం కనీస మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో ప్రస్తుతం శ్లాబ్ నుంచి పెచ్చులూడుతున్నాయి. గోడలు బీటలు వారడంతో ఏ క్షణం కూలిపోతుందోనని భయాందోళనతో రోగులు ఇక్కడకు వచ్చేందుకు ఆసక్తిచూపడం లేదు.దీనికితోడు ఆసుపత్రి ఆవరణ అధ్వానంగా ఉండడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. ఈ భవనంలో పక్కనఉన్న ఐటీసీకేంద్రం భవనం దుస్థితి కూడా అధ్వానంగా ఉండడంతో రోగులు ఈ రెండు కేంద్రాలకు వేళ్లేందుకు ఆశక్తి చూపడం లేదు. ఉన్నతాదికారులు స్పందించి ఇతర గదుల్లోకి ఆయుర్వేద ఆసుత్రి మార్చాలలని రోగులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఆయుర్వేద ఆసుపత్రి

మట్టికొట్టుకుపోయి.. రాళ్లుతేలి

● ఇదీ లొద్దభద్ర పంచాయతీలో గిరిజన గ్రామాల రోడ్ల దుస్థితి

పలాసరూరల్, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లొద్దభద్ర పంచాయతీ పరిధిలోగల మహాదేవపురం నుంచి పొత్రియవయా కొరారింగి తాళభద్ర వరకూ గిరిజన రహదారులు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో గులకరాళ్లు తేలాయి. ఈ రహదారికి ఆనుకొని ఉన్న మట్టి కొట్టుకు పోవడంతో రోడ్డు పక్కన గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. రహదారికి ఆనుకుని ఉన్న చెరువు వద్ద గల ప్రమాదకర మలుపు వద్ద, రోడ్డుపై ఏర్పడిన గోతుల్లో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే వారు పడిపోవడంతో గాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



మహాదేవపురం నుంచి పొత్రియ వెళ్లే రహదారిలో చెరువుకు ఆనుకుని బెర్మ్‌లు కొట్టుకుపోయిన దృశ్యం

ప్రతి ఒక్కరికీ వైద్యసేవలందించాలి

● జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త కళ్యాణబాబు



ఏరియాఆసుపత్రిలో విచారణ నిర్వహిస్తున్న డీసీహెచ్ కళ్యాణబాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసన్నపేట, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి వైద్యసేవలందించాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త సీహెచ్ కళ్యాణబాబు కోరారు. శనివారం నరసన్నపేట ఏరియా అసుపత్రిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యసేవలపై ఆరాతీశారు. నరసన్నపేట ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం నిండు గర్భిణికి తనిఖీచేయని వ్యవహారంపై ఇక్కడ వైద్యం .. చేయం శీర్షికతో కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురించింది. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త కళ్యాణబాబు పరిశీలించి వైద్యసేవలను అందించకపోవడంపై సిబ్బంది అడిగితెలుసుకున్నారు. వచ్చిన ప్రతిఒక్కరి ఆదరించి వైద్యసేవలను అందించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతమైతే శాఖపరంగా చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత వైద్యులు, సిబ్బంది నుంచి లిఖిత పూర్వకమైన సంజాయిషీ తీసుకున్నారు ఇతర సేవలపై కూడా ఆరా తీశారు.ఈకార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లేక పనులు సాగలే

● మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పర్యాటకులకు తప్పని అగచాట్లు ● ఇదీ శివసాగర్ బీచ్‌లో పరిస్థితి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శివసాగర్‌బీచ్‌లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ప్రజాప్రతినిధుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతో బీచ్‌లో పనులు పడకేశాయి. జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రంగా ఉన్నా మౌలిక వసతులు కొరవడ్డాయి. దీంతో ఇక్కడికి వచ్చే పర్యాటకులకు అగచాట్లు తప్పడం లేదు.

శివసాగర్ బీచ్‌లో అభివృద్ధి పనులకు గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న గౌతుశివాజీ 2014లో 90 లక్షలు నిధులు మంజూరు చేయడానికి కృషిచేశారు. ఈ నిధుల్లో 30 లక్షల వరకూ పనులు జరిగాయి. ఇంతలో వరుసగా హుద్‌హుద్, తితలీ తదితర తుఫాన్ల వల్ల షెడ్లు ఎగిరిపోవడంతోపాటు రాతివాల్స్ కొట్టుకుపోయాయి. ఈనేపథ్యంలో చేసిన పనులు బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం బీచ్‌లో ఎటువంటి అభివృద్ధి పనులకు చేపట్టలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరు వాత శివసాగర్ బీచ్ అభివృద్ధికి చర్యలు చేపట్టేందుకు చర్యలు ప్రారంభించినా స్థలం వివాదం వల్ల పనులు ముందుకు సాగడంలేదని అధికారులు చెబు తున్నారు. ఇక్కడకు ఏటా కార్తీకమాసంలో పర్యాటక సంఖ్యపెరుగు తున్నా బీచ్‌లో మరుగుదొడ్లు, హోటళ్లు వంటి మౌలికసదుపాయాలు లేకపోవడంతో దూరప్రాంతాల నుంచి వచ్చేవారు నిరాశకు గురవుతున్నారు. నవంబరు నుంచి జనవరి వరకు ఇక్కడకు పిక్నిక్‌కు వచ్చే పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా శివసాగర్ బీచ్‌ను పర్యటంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు తెలిపారు.



శిథిలావస్థకు చేరిన పర్యాటకుల విశ్రాంతి షెడ్లు



పోలాకి :గర్ల్స్ చైల్డ్ డేఆంగ్ల అక్షర రూపంలో కూర్చొన్న బాలికలు



జలుమూరు: విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం రాఘవులు

బాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

జలుమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలికలు బాలురుతో సమానంగా అన్ని రంగాల్లోను రాణించాలని శ్రీముఖలింగం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంరాఘవులు తెలిపారు. శనివారం శ్రీముఖలింగం అంగనవాడీ కేంద్రంలో అంతర్జాతీయ బాలికలు దినోత్సవం పురస్కరించుకొని కిశోర బాలికలకు వ్యాసరచన, ఆటలు పోటీలు నిర్వహించి విజేత బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, దేవి, మాలతి, భవాని పాల్గొన్నారు.

● పలాస, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):స్థానిక రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో అంతర్జాతీయ గర్ల్‌చైల్డ్ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు గర్ల్‌చైల్డ్ డేచిహ్నం మానవహారంగా ఏర్పాటుచేసి ఆకట్టుకున్నారు.ఈసందర్భంగా విద్యార్థులకు సంస్థ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి అభినందించారు.

● ఎల్.ఎన్.పేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):లక్ష్మీనర్సుపేటలో బాలల హక్కుల పరిరక్షణవేదిక జిల్లా కార్యదర్శి మన్మథకుమార్‌మిశ్రో అధ్యక్షతన అంతర్జాతీయ బాలికల దినోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్‌చంద్రపండా, గౌతమి, ప్రియాంక పాల్గొన్నారు.

● పోలాకి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):గంగివలస కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పోలాకి పీహెచ్‌సీ విస్తరణాధికారి నల్లి రవికుమార్ ఆధ్వర్యంలో బాలికలకు జాతీయ బాలికా దినోత్సవంపై అవగాహన కల్పించారు. బాలికలు గర్ల్స్ చైల్డ్ అన్న అక్షరాల మాదిరిగా ప్రదర్శన ఏర్పాటుచేశారు.ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఇన్‌చార్జి జ్యోతి, పీఈటీ ప్రియాంక, శేఖర్‌బాబు, ఇందిర, బరాటం లక్ష్మి పాల్గొన్నారు.

రేపు టెక్కలిలో వైద్యశిబిరం

టెక్కలి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా ఆసుపత్రిలో జెమ్స్ సూపర్ స్పెషాల్టీ బృందం సౌజన్యంతో సోమవారం క్యాన్సర్ వ్యాధుల నిర్ధారణ కోసం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జెమ్స్ ఏజీఎం బి.చిన్నారావు తెలిపారు. టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రీకార్డియాలజీ, ప్రీనెఫ్రాలజీ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు.

లఖందిడ్డిలో సత్సంగం

కోటబొమ్మాళి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లఖందిడ్డి అయ్యప్ప ఆలయంలో అర్చకులు రామాయణం సన్యాసిరావు, ఆలయ ధర్మకర్త బమ్మిడి గణపతి ఆధ్వర్యంలో శనివారం సత్సంగ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో విజయనగరం గీతాప్రచారకులు చలుమూరిఅన్నపూర్ణమ్మ, ప్రవచనకారులు సనపల కరుణ్‌కుమార్, బమ్మిడి శ్రీరాములు, బలగ కృష్ణారావు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన అవసరం

పాతపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి):విపత్తులను ఎదుర్కోవడంలో అవగాహన అవసరమని వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని కొమ్మలగూడ సామాజిక భవనంలో వాతావరణ విపత్తులతో కలిగే నష్టాలను అధిగమించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాతా వరణంలో వస్తున్న మార్పులను వివరిం చారు. ప్రభుత్వం రూపొందించిన కార్యా చరణ ప్రణాళికల అమలులో స్వచ్ఛంద సంస్థలు క్రియాశీలక పాత్ర పోషిస్తు న్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీవో రంగారావు, మొబలైజర్ కామేశ్వర్, లక్ష్మి శాంతి ప్రియ పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు

పలాస, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఫ్లైఓవర్ బ్రిడ్జిలో (ఆర్వోబీ) ఇళ్లు,షాపులు కోల్పోయిన నిర్వాసితులందరికీ సకాలంలో ఇళ్లస్థలాలు అందజేస్తామని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్ తెలిపారు. శనివారం స్థానిక నెమలికొండ ప్రాంతంలో నిర్వాసితులకు కేటాయించిన ప్రభుత్వ స్థలాలను టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిఒక్క నిర్వాసితునికి సెంటున్నర స్థలాన్ని కేటాయిస్తూ ఎమ్మెల్యే గౌతు శిరీష ఇటీవల పట్టాలు అందించారని, ఆ స్థలాలు త్వరలో అప్పగిస్తామని తెలిపారు. కార్యక్రమంలోదడియాల నర్సింహులు, నవరరాంబాబు, కొత్త సత్యం, చంద్రశేఖ ర్త్యాడి, బద్రి గోపాల్ పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడియత్నం హేయం

మందస,అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి యత్నం హేయమని షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి మోహనరావు తెలిపారు. శనివారం మందసలో విలేకరులతో మాట్లాడుతూ నిరసనగా సోమవారం మందసలో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సంఘ కోశాధికారి వై.తులసీదాస్, ఉపాధ్యక్షులువల్లభరావు, సంయుక్తకార్యదర్శి శాంతారావు, మట్ట ధర్మరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నరసన్నపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు కేశవరావు, వేణుగోపాలరావు కోరారు. ఈ మేరకు శనివారం నరసన్నపేటలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడుకు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు.

55 గ్రాముల బంగారం రికవరీ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ కేసులో వ్యక్తిని శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళంలోని తిలక్‌నగర్‌లో ఓ ఇంట్లో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో సీపన్నాయుడు పేటకు చెందిన బెండి అజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి విచారణ చేపట్టి ఆయన వద్ద నుంచి సుమారు 55 గ్రాముల బంగారం రికవరీ చేసినట్టు టూటౌన్ సీఐ ఈశ్వరరావు తెలిపారు. ఈయన గతంలో కూడా బలగ బుచ్చిపేటలో ఓ ఇంటిలో దొంగతనం చేసినట్టు విచారణలో తేలిందన్నారు.

కొత్తూరు తహసీల్దార్‌పై కేసు నమోదు

కొత్తూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలోకి బలద గ్రామానికి చెందిన అరుబోలు కమల మరో ఇద్దరు దేవాడ చంద్రశేఖర్, సనపల రవికుమార్ అక్రమంగా ప్రవేశించి కులం పేరుతో దూషించి అవమానించారని కొత్తూరు తహసీల్దార్ కె.బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కమల, మరో ఇద్దరిపై అట్రాసిటీ కేసునమోదు చేసినట్లు కొత్తూరు ఇన్‌చార్జి ఎస్ఐ కె.రాజేష్ తెలిపారు. అలాగే స్థలానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ దరఖాస్తు చేసుకోగా కార్యాలయానికి వెళ్లిన తనను కొత్తూరు తహసీల్దార్ బాలకృష్ణ అసభ్యకరంగా ప్రవర్తించి అవమానించారని అరుబోలు కమల ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈమేరకు తహసీల్దార్‌పై కేసు నమోదు చేసిన ట్లు తెలిపారు.అట్రాసిటీ కేసును టెక్కలి డీఎస్పీ దర్యాప్తుచేస్తారని చెప్పారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

మెళియాపుట్టి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరవమర్రిపాడు సమీపంలో శనివారం పేకాటాడుతున్నా ఏడుగురును అరెస్టు చేసి వారి వద్ద నుంచి 8,750 నగదు ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. ఈమేరకు కేసునమోదు చేసినట్లు చెప్పారు.

మలేసియా వర్సిటీ అధ్యాపకుల సదస్సు

టెక్కలి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలోని ఐతం కళాశాలలో మలేసియాయూనివర్సిటీ పెర్లిస్‌కు చెందిన డాక్టర్ హుయ్ లిన్ అంగ్ సదస్సు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు.ఈసందర్భంగా పర్యావరణహిత సాంకేతికలు,వ్యవసాయ వ్యర్థాలను వినియోగించే కొత్తమార్గాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సివిల్‌విభాగ హెచ్‌వోడీ దినకర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పాతపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కాపువీధికి చెందిన రఘుబాబు సామంత జెన్నాను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం పరామర్శించారు. రఘుబాబు తమ్ముని భార్య సబిత కుమారిజెన్నా సామంత ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. అనంతరం తామరకి చెందిన దాము అప్పారావు, నెలమపురి సరస్వతమ్మ ఇటీవల మృతిచెందడంతో ఆయా కుటుంబాలను పరామర్శించారు. కాగా పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వీవోఏ సంఘం సంఘ నాయకులు కలిశారు. మూడేళ్ల కాలపరిమితి నిలిపివేసే నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

జంట పట్టణాల్లో వర్షం

● చెత్త, మురుగునీటితో నిండిపోయిన కాలువలు



మూడు రోడ్ల జంక్షన్‌లోని కాలువలో పేరుకుపోయిన చెత్త, మురుగునీరు

కాశీబుగ్గ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి కాలువల్లో మురుగునీరు, చెత్త చేరింది. ప్రధానంగా కాశీబుగ్గ మూడురోడ్ల జంక్షన్‌వద్ద గల కాలువలో చెత్త, మురుగునీరు పేరుకుపోయి రోడ్డుపైకి చేరడంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థలకు గురయ్యారు.కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్డుపైకి రావడం వల్ల దుర్వాసనతో ఇబ్బంది పడ్డామని పలువురు వాపోయారు. కాశీబుగ్గ మేదరవీధి, రైల్వేగేటు దగ్గరఉన్న సంతోషిమాత ఆలయం రోడ్డుపై మురుగునీరు ప్రవేశించడంతో వాహనచోదకులకు ఇబ్బంది కలిగింది.

మూలపేట పోర్టు పరిశీలన

సంతబొమ్మాళి,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టును శనివారం రాష్ట్ర అధికారుల బృందం పరిశీలించింది. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ అధికారి కృష్ణబాబు, మారిటైం సీఈవో ప్రవీణ్‌కుమార్, ఆదిత్యాలు పోర్టులో వివిధ విభాగాలను పరిశీలించారు. పనులకు సంబంధించిన వివరాలను అధికారులకు అడిగితెలుసుకున్నారు. వీరి వెంట కలెక్టర్ స్వప్నిల్‌దినకర్,తదితరులు ఉన్నారు.

అన్నాక్యాంటీన్ ప్రారంభానికి సిద్ధం



పనులు పూర్తయిన అన్నాక్యాంటీన్

కోటబొమ్మాళి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి అన్నాక్యాంటీన్ ప్రారంభానికి సిద్ధంచేశారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.61 లక్షల వ్యయంతో పనులకు జూన్ 28న శంకుస్థాపన చేశారు. స్థానిక టీడీపీకార్యాలయం వద్ద 500 రోజులుగా పేదలకు రూ.ఐదుకే భోజనం అందజేస్తున్న విషయం విదితమే. కొత్తగా నిర్మించిన అన్నాక్యాంటీన్ ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయం దగ్గరలో ఉండడంతో కార్యాలయాలకు వచ్చే అర్జీదారులకు ఉపయోగపడనుంది.

జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాలకూ మేలు



చిన్నగుజ్జువాడలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

జలుమూరు, (సారవకోట) అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులపై గతంలో 18 శాతం ఉన్న జీఎస్టీ ఐదు శాతానికి తగ్గించడంతో అన్ని వర్గాల వారికి మేలు చేకూరుతుందని టీడీపీ మండలాధ్యక్షులు కత్తిరి వెంకటరమణ తెలిపారు. సారవకోట మండలంలోని చిన్నగుజ్జువాడ, కోదడ్డపనస, బద్రి, గుమ్మపాడు గ్రామాల్లో సూపర్ జీఎస్టీ కార్యక్రమంలో భాగంగా తగ్గిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, భాస్కరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

టెక్కలి రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):నర్సింగపల్లికి చెందిన గేదెల పగడాలమ్మ అనారోగ్యంతో మృతిచెందడంతో ఆ కుటుంబానికి గ్రామస్థులు అండగా నిలిచారు.ఈ మేరకు శనివారం గ్రామస్థులు 67 వేలు నగదును పగడాలమ్మ భర్త అప్పాలస్వామికి అందజేశారు. దహనసంస్కారాలుచేసేందుకు ఇబ్బందులు పడుతుండడంతో గ్రామస్థులు ముందుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ పి.షన్ముఖరావు, బాలరాజు, పాపారావు, సూర్యనారయణ, శంకరరావు, ఎన్ని షన్ముఖరావు పాల్గొన్నారు.

పాత్రనివలసలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నందిగాం,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పాత్రనివలసలో శనివారం ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శ్యామలరావు, జ్ఞానేశ్వరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు.



నందిగాం: ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

శ్రీముఖలింగంలో పగటి వేషధారణలు

జలుమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో గౌరీ ఉత్సవాలు పురస్కరించుకొనిశనివారం నిర్వహించిన పగటి వేష ధారణలు ఆకట్టుకున్నాయి. యువకులు పగటి వేషాలతో ఇంటింటా తిరిగి గౌరీ ఉత్సవాలు ప్రాధాన్యతను వివరించారు. అలాగే పలువురు మహిళలు నందెమ్మ వద్ద బిందె, ముంత దీపాలు వెలిగించారు.

కుట్టు మిషన్ల పంపిణీ: ఈడీ

పోలాకి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 29 మండలాల్లో 29 ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలు ప్రారంభించామని బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షకులకు జీతాలు ఇవ్వనున్నామని, మహిళా అభ్యాసకులకు వారి పేరుతో శిక్షణ పూర్తిచేసినట్లు కలెక్టర్ ధ్రువీకరణతో ఉచిత కుట్టు మిషన్ అందజేస్తామని తెలిపారు. ఏప్రిల్ నుంచి శిక్షణ కేంద్రాలను ఎమ్మెల్యేలు, ఎంపీడీవోల ఆధ్వర్యంలో ప్రారంభించినట్లు తెలిపారు.పర్యవేక్షణా బాధ్యత ఎంపీడీవోలకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మూడునెలల పాటు నిర్వహించిన శిక్షణలో ఒక్కో కేంద్రంలో 350 మంది మహిళలకు రెండువిడతలుగా శిక్షణ తరగతులు నిర్వహించేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇందుకోసం 29 మంది శిక్షకులను నియమించినట్లు పేర్కొన్నారు. శ్రీకాకుళం మినహా మిగతా కేంద్రాల్లో కుట్టుశిక్షణ కాలం ఇప్పటికే ముగిసిపోయిందని తెలిపారు. శిక్షణ పొందిన కేంద్రాల శిక్షకుల నిర్వాహకుల నుంచి దస్త్రాలు, ముఖ హాజరు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. పరిశీలించిన తర్వాత శిక్షకులకు జీతాలు, అభ్యాసకులకు ధ్రువపత్రాలు మండలాల వారీగా త్వరలో పంపిణీ చేస్తామని తెలిపారు. శిక్షణలో అభ్యాసకుల ముఖ హాజరు ప్రాప్తికి ధ్రువపత్రాలు, కుట్టుమిషన్లు ఉచితంగా అందజేసేందుకు ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొనారు.

ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేశారు

కాశీబుగ్గ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమం గాలికి వదిలేశారని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. శనివారం కాశీబుగ్గలో వైసీపీ డిజిటల్ బుక్ ఆవిష్కరణ, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ కోటి సంతకాలు సేకరణ తదితర అంశాలపై కార్యక్రమం నిర్వహించారు.



కొరసవాడలోని కాలువలో నిలిచిన మురుగునీరు

పూడికలు తీయక.. మురుగు పేరుకుపోయి

● ఇదీ పాతపట్నం మండలంలోని పలు గ్రామాల్లో పరిస్థితి

పాతపట్నంరూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలక్ష్మీపురం, కొరస వాడ, కాగువాడ, తెంబూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. రోజుల తరబడి పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు చెత్త కుళ్లడంతో దుర్వాసన వెలువడుతోంది. దీంతో వ్యాధులు ప్రబలుతాయన్న భయాందోళన నెలకొంది. కనీసం కాలువల్లో పూడికలు సైతం తీయక పోవడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువల్లోని చెత్త రహదారులపైకి వచ్చి చేరు తుండడంతో పాదచారులు, వాహనచోదకులు అవస్థలకు గురవుతున్నారు. దీంతో చీకటిపడిన తర్వాత దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో వ్యాధులు ప్రబలుతా యోమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.